

# మానవత్వాన్ని పరిమళించిన

## వి. లక్ష్మణరావు

ఖరీదైన అలవాట్లు ఉండే ఖరీదైన మనుషుల గురించి కథలు వ్రాయడం శ్రీపతికి నచ్చదు. నీతికి అవినీతికి మధ్య గీతని చాలా సన్నదైనదిగా తలంచి దాన్ని చెరిపేయడానికి వెనుకాడని భౌతికవాదుల గురించి కథలల్లడం చాలా చికాకు శ్రీపతికి. అందుక్కారణం ఒక్కటే! వాళ్ళ గురించి చదవడమేతప్ప వాళ్ళతో కలసిమెలసి తిరిగే అవకాశం లేకపోవడమే.

అతనికి అన్ని విధాల తగిన ఇల్లాలు సుజాత. ట్రూత్ఈజ్ స్ట్రేంజర్‌దేన్ ఫిక్షన్ సామెతకు నిరూపణామె. స్త్రీ సహజమైన ఆభరణాలపై మోజులేదామెకు. ఖరీదైన చీరలంటే ఆమెకు ఇష్టంలేదు సరికదా అవంటే ఆమెకు భయం.

"సుజా! పెళ్ళయి రెండేళ్ళయింది. నాకు బోనస్ వచ్చేవు, ఎరియర్స్ వచ్చేయి. పెళ్ళయిన తర్వాత నా అర్జనతో నీకో నెక్లెస్ కొనాలనుంది. సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన తర్వాత బజారుకెళ్ళి నీకు నచ్చిన నగకొందాం సరేనా?" ఆమె నిడుపాటి నీలి కురులతో ఆడుకుంటూ అన్నాడు.

"ఆ రెండు చేతులూ ఇలా అందివ్వండి. ఆ ... ఈ నెక్లెస్ రోజుకోసారయినా ధరించే అవకాశం వస్తే ఏడు వారాల నగలు ఇచ్చినట్టు పొంగిపోతాను. వచ్చిన డబ్బుని రెండేళ్ళకు ఫిక్సెడ్ డిపాజిట్టులో వెయ్యండి. డబ్బును ఆర్జించి అవసరానికి ఆదుకునే విధంగా దాచుకోవడం మనబోటి ఆస్తులులేని కుటుంబ కర్తవ్యం. ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు అర్ధరూపాయి మల్లెలు తీసుకురండి. ఇందండి, మీ టిఫెన్‌బాక్స్, బ్రెడ్ హల్వా బజ్జీలు పెట్టేను. తన నీలి కురుల్ని లాక్కుని రెండు చేతులూ ఎత్తి ముడి వేసుకుంటూ అంది సుజాత. ఆ దృశ్యాన్ని చూసిన శ్రీపతి ఆమెను గుండెలకు అదుముకుని పెదాలను చుంబించి ఆమె గుండెల మీద కొన్ని క్షణాలు తలనుంచి బయటకువచ్చి సైకిలెక్కేడు.

"ఒరేయ్ శ్రీపతీ! ఇన్‌స్టాల్‌మెంట్స్ మీద ఒక టూ వీలర్ కొనుక్కోరా. ఎన్నాళ్ళ సైకిల్‌యానం" కొలీగ్ సలహా.

"వద్దండి! నాతాళిని గట్టిగా ఇలానే ఉండనివ్వండి: రెండుండలబండీ ప్రమాదాల కాహ్వానం. సైకిల్ త్రొక్కడం మంచి ఎక్సర్‌సైజ్. మీ బలమైన కాళ్ళ వెనుక రహస్యం ఈ సైకిల్ తొక్కడమే," భార్య దగ్గర స్కూటర్ ప్రస్తావన తెచ్చినప్పుడు సుజాత అన్న మాటలు.

"లేదు బ్రదర్! మా సుజా వద్దంది. ఆమె వద్దన్న పని చేసే సాహసం, చేయాలనే ఇష్టం నాకులేవు."

తన సీట్లో కూర్చుని ఆరోజు చూడాల్సిన ఫైళ్ళలో మునిగిపోయాడు శ్రీపతి.


"సార్! మేనేజర్‌గారు తమర్ని రమ్మంటున్నారు సార్" ఎటెండర్ నాయర్ మాటలకు తలెత్తి వెళ్తున్నట్టు తలూపేడు శ్రీపతి.

"మిస్టర్ శ్రీపతి! నీకు పేదలంటే, వృద్ధులంటే, స్త్రీలంటే అమితమైన జాలుండొచ్చు. మంచిదే కాని ఆమెకు ఇంకా పది రోజులు పెయిడ్ లీవ్ పొడిగించమని రికమండ్ చేసేవు..."

"సార్! ఆమె గర్భవతిగా ఉన్నప్పుడే భర్త పోయేడు. అత్తింటివారు కోపంతో ఆమెను చేరదీయలేదు. పుట్టింటివాళ్ళు నిరుపేదలు. అయినా ఆ బిడ్డకోసం గుండె రాయి చేసుకుని బ్రతుకుతోంది. ఆమెకు సాయం చేయగలిగే వాళ్ళం, చేయవలసినవాళ్ళం మనమేసార్! పనికి ఆటంకం లేకుండా, రాకుండా ఆమె సీటు పనిని కూడ నేనే చూస్తున్నాను దయచేసి నా అభ్యర్థనను మన్నించండి సార్!" రెండు చేతులు ఎత్తి నమస్కరిస్తూ అన్నాడు.

తల నెరసిన మేనేజర్ కన్నులు చెమర్చాయి.

"శ్రీపతీ! మంచితనమ్మీద నమ్మకం పోయింది. మానవత్వమ్మీద నా కింకా నమ్మకం ఉందంటే అందుక్కారణం అడపా తడపా నీలాంటివాళ్ళెదురవడం. అలానే, లిటజ్ గ్రాంట్‌హర్ లీవ్. యూ కెన్ గో!" తల వంచుకుని రాబోతున్న కన్నీటిని అతి ప్రయత్నంమీద ఆపు



కుంటూ అన్నాడు మేనేజర్ దయాచారి.

"థాంక్సండి! రాధకు లీవు ఎక్స్టెండ్ చేయించేరు. ఆమె చాలా సంతోషిస్తుంది. ఈ సంగతి తెలిస్తే", త్రిపిస్ట్ అనురాధ కళ్ళల్లో కృతజ్ఞత కనిపించింది.

రాధ, అనురాధ క్లోజ్ ఫ్రెండ్స్.

"ఆఫీసయిన తర్వాత రాధను చూడ్డానికి వెళ్దామనుకుంటున్నాను. మీతో పాటే నన్ను వాళ్ళింటికి తీసుకు వెళ్తారా?

"ష్యూర్ సర్! మీరేవచ్చి ఆమెకు ధైర్యం కలిగే రెండు మాటలు చెప్తే ఆమె ఎంతగా సంతోషిస్తుందో నేనూహించ గలను. అలానే సర్!" అనురాధ గొంతులో సంతోషం, ఆత్రుత, కృతజ్ఞతా భావం కలగలుపుగా చోటు చేసుకున్నాయి.

రాధ కన్నులముందు మెదిలింది. ఎక్కడో ఢిల్లీలో ఉన్న తన చెల్లెలు మనసులో మెదిలింది. రాధకి తన చెల్లికి చాలా సారూప్యత ఉంది. ముఖ్యంగా రాధ నవ్వితే తన చెల్లెలి రూపమే శ్రీపతి ముందు నిలుస్తుంది. శ్రీపతికి ఒకే ఒక్క చెల్లెలు రమ. ఆమె అంటే శ్రీపతికి ప్రాణం.

"నాన్నా! చెల్లికి అంతదూరం సంబంధం చేయడం నా కిష్టంలేదు, దగ్గర్లో...

"బాబూ! ఆడపిల్లకు వివాహం నిశ్చయించగలం. కాని ఆమె అదృష్టాన్ని నిర్ణయించలేం. మంచి సంబంధం. అబ్బాయి బుద్ధిమంతుడు. కట్నాలమీద ఆశలేని కుటుంబం. ఇంతకంటే మంచి సంబంధం మనం చూడలేము బాబూ!ఆమె దూరంగా ఉండడం అందరికీ బాధ కలిగించే విషయమే! కాని ఎక్కడున్నా ఆమె ఆనందంగా ఉంటే అంతే చాలు బాబూ".

తండ్రి మాటలకు ఎదురు చెప్పలేదు శ్రీపతి. చెల్లెల్నించి నెలకోసారైనా ఉత్తరం రాకపోతే కంగారు పడతాడు శ్రీపతి. నెలాఖరు వచ్చేస్తున్నా చెల్లెలి నుంచి ఉత్తరం రాలేదని రోజుకొక సారైనా భార్యతో అంటున్నాడు శ్రీపతి.

"రండి! రాధ ఇంటికి వెళ్దాం",

అయిదున్నరతర్వాత శ్రీపతితో అంది అనూరాధ.

ఆమెను రిక్షా ఎక్కించి తను సైకిల్ మీద బయలు దేరేడు శ్రీపతి. అనూరాధను, శ్రీపతిని చూసి కొన్ని క్షణాలు స్తబ్దుగా నిలబడి పోయింది రాధ. ఆమెను చూసి శ్రీపతి చిరునవ్వు నవ్వేడు. ఆమె అసంకల్పితంగా తనదైన నవ్వును ముఖమ్మీద వెలిగించింది. తన చెల్లెలు ఎదురుగా నిలిచిన అనుభూతి కలిగింది శ్రీపతికి.

కొంతసేపు అదీ ఇదీ మాట్లాడిన తర్వాత నేరుగా విషయాని కొచ్చేడు.

"రాధగారూ! ఎంతో ఆలోచించి నేనో నిర్ణయాని కొచ్చేను. ఓ నెల్రో జులపాటు మీరు మీ బిడ్డ మా ఇంటి కొచ్చి ఉండండి. మీరు పూర్తిగా శక్తిని పుంజుకోడానికి అదొక్కటే మార్గంగా తోచింది", ఇంక చెప్పేదేం లేదన్నట్టు నిశ్శబ్దంగా ఉండి పోయేడు.

అనూరాధ కళ్ళల్లో ఆశ్చర్యం. రాధ ముఖంలో సంతృప్తి వెలుగు.

"మీ ఆవిడ కేమైనా అభ్యంతర ముంటుందేమో, ఆమె కోసారి చెప్పి....

"మంచి పనికి మా ఆవిడ సహకారం ఉంటుందన్న నమ్మకం నాకుందండీ. సాటి మనిషిని అవసరంలో ఆదుకోకపోతే మన మనుగడ మనిషి మనుగడవదండి. కావల్సిన బట్టలు సామాన్లు సర్దుకుని మీరూ, అనూరాధ మా ఇంటి కెళ్ళండి నేనలా బజార్లో పని చూసుకొని ఇంటి కొచ్చేస్తాను. బహుశా మీకంటే ముందుగానే ఇల్లు చేరతానేమో!" అని చెప్పేసి బయటకు వెళ్ళిపోయాడు శ్రీపతి.

## మానవత్వం పరిమళించిన వేళ

"శ్రీపతిని చూస్తే తోటి మనుష్యుల మీదే కాదు, ఆ భగవంతుడి మీద కూడా నమ్మకం దృఢపడు తుంది రాధా", సాలోచనగా అంది అనురాధ.

"మానవత్వం, దైవత్వం మనిషి ఉనికి నాణెపు రెండు వైపులు", పసివాడికి రొమ్ము నందిస్తూ అంది రాధ.

ఇద్దరూ కలసి శ్రీపతి ఇంటికి వెళ్ళేరు. సుజాత ఇద్దర్నీ సాదరంగా ఆహ్వానించింది. రాధ భుజమ్మీద పసివాడ్ని చేతుల్లోకి తీసుకుంది.

అనూరాధ విషయాన్ని వివరించింది.

"మా ఆడపడుచు మా ఇంట్లో ఎప్పుడూ ఉండడం జరగ లేదు. ఈ ఇంటి ఆడపడుచులా స్వేచ్ఛగా ఉండమ్మా. కంటికి రెప్పలా నిన్నూ నీ బిడ్డనీ చూసుకుంటాం". సుజాత గొంతులో ఆప్యాయత, ఆదరణ భావం చోటు చేసుకున్నాయి. వాళ్ళని కూర్చోమని చెప్పి వంటింట్లోకి వెళ్ళింది సు జాత.

శ్రీపతి వచ్చి రెండు నిముషాలు మాట్లాడి అనూరాధని రిక్షా ఎక్కించి ఇంట్లోకి వచ్చి భార్యతో మాట్లాడ్డానికి వంటింట్లోకి వెళ్ళేడు.

"సుజా! నీకు ముందుగా చెప్పకుండానే.."

"ఓహో! రమా వచ్చేముందు కూడా నా పర్మిషన్ తీసుకుంటారా? ముఖం కడుక్కుని రండి టిఫిన్ చేద్దురుగాని", నవ్వుతూ భర్తతో అంది సుజాత

కాఫీ త్రాగిన తర్వాత ఇచ్చింది చెల్లెలి రమ నుంచి వచ్చిన ఉత్తరం

"ఓపెన్ చెయ్యలేదేం సుజా!" ఆశ్చర్యంగా అడిగేడు శ్రీపతి మల్లెల దండ నల్లుతున్న సుజాత నవ్వుతూ భర్త వంక చూసింది

"మీ ముద్దుల చెల్లెలి ఉత్తరం నేనెప్పుడైనా ముందు ఓపెన్ చేసేనా. మీరే చదివి చెప్పడం మామూలేగా. ముఖంలో చిరునవ్వు కదులుతూంటే అంది సుజాత

ప్రియమైన అన్నయ్యా!

పదిహేను రోజుల క్రితం మీ బావగారు స్కూటరు మీద వస్తూంటే ఏక్సిడెంటయింది ఈ రోజే హాస్పిటల్ నుంచి డిస్చార్జ్ చేసేరు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు కొన్నాళ్ళు రెస్ట్ అవసరమని మరో పది రోజులు లీవు పొడిగించారు. ఆయన కొలీగ్ ఒక పంజాబీ. ఈ పదిహేను రోజులు స్వంత అన్నదమ్ముడిలా నాకు అండగా నిలిచేరు ఎన్ని వేలు ఖర్చు పెట్టుంటారో. ఆ ఋణాన్ని తీర్చుకోగలం కాని, ఆయన చూపించిన ఆప్యాయతకు వెల కట్టలేము. ఆ ఋణం మాత్రం తీర్చుకోలేనిదే

నాన్నగారికి కాని, నీకుగాని వ్రాస్తే కంగారు పడతారని మీకు వ్రాయలేదు నన్ను మన్నించు. ఆ భగవంతుడు ఆయన స్నేహితుని రూపంలో ఆదుకున్నాడు

నీ ముద్దుల చెల్లి
నీకు నమస్కరిస్తూ.

ఆ ఉత్తరాన్ని చదివి శ్రీపతి కళ్ళు చెమర్చాయి. కొన్ని క్షణాల్లో నిలద్రొక్కు కున్నాడు

"సుజా! రేపే బయలుదేరి ఢిల్లీ వెళ్తాను. ఎరియర్స్ పదివేలు తీసుకుని వెళ్తాను అక్కడ అవసరానికి ఆదుకోవచ్చు. దయాచారికి చెప్పి వెళ్తాను. మిమ్మల్ని చూసి వెళ్తూ ఉండమని ఆ భగవంతుడు కరుణామయుడు. కాని చెల్లెల్ని, బావగార్ని చూసి వస్తే తప్ప నాకు మనశ్శాంతి ఉండదు", అతని కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూంటే చూసిన ఆ స్త్రీలిద్దరూ అవాక్కయి అలానే ఉండి పోయారు. ○

